# భుజ కీర్తులు

భూపతిరావు రచన్లు చెయ్యటం మొదలునెట్టి ఆర్నెలయ్యింది. ఈ ఆర్నెల్ల కాలంలో ఎన్ని కథలు వ్రాశి పంపేడో , అన్నీ వెనక్కి తిరిగి రావటంచేత వర్రీ అయ్యి, ఆపైన విసిగిపోయాడు. ఇక లాభం లేదని చెప్పి, కలం మూసేసి కాలక్షేపం చేద్దామనకుంటుండగా అతడికో మహత్తరమైన ఆలోచనొచ్చింది.

అంతకుమునుపు తిరగొచ్చిన కథని యధతంగా వ్రాశి " రచన : శ్రీమతి బి.పిరావ్ " అని మార్చి పోస్టులో పడేసి, మందు మార్చిన వైద్యుడిలా ఫలితం కోసం ఎదురుచూడసాగాడు . పది రోజుల తర్వాత అంతకు మునుపు ఆ కథని త్రిప్పి కొట్టిన ఆ పత్రికవాళ్ళే , అది తమకు నచ్చినట్లు, వీలువెంబడి ప్రచురింపబోతున్నట్టు వ్రాసారు వ్యాపార రహస్యం తెల్సుకున్న వాడిలా తనలోతాను చిన్నగా నవ్వుకున్నాడు.

సరిగ్గా రెండు నెలల తర్వాత తాను వ్రాసిన కథ ప్రచురింపబడటం, కథతో పాటుగా అందమైన బొమ్మ .... .చూసుకుని సంతోషంతో ఎగిరి గంతేసి ఆకాశాన్నందుకున్నాడు.

మళ్ళీ సరిగ్గా నెలరోజుల తర్వాత ప్రచురింపబడ్డ ఆ కథకి పారితోషకంగా ముచ్చటగా మూడు పాతికలు పంపించారు పత్రికాధికారులు. కానీ అంతకు మునుపే చెయ్యి తిరిగిన ఒక రచయిత ఆ పత్రిక వాళ్ళు కథకి పారితోషికంగా నూట పదహార్లు ఇస్తున్నట్లుగా చెప్పినట్లు భూపతిరావుకి గుర్తు. కానీ ఇదే మిటి చెప్మాని మళ్ళీ బాధపడ్డాడు. ఒకవేళ కూలీ రేట్ల లాగా , రచయితలకి , రచయిత్రులకి వేరువేరు రేట్లు వున్నాయేమోనని కించిత్తు అనుమానపడ్డాడు. ఏదీ ఏమైనా విషయం తేల్చుకుందామని ఒక రోజు పత్రికాఫీసుకి ప్రయాణం కట్టేడు.

అక్కడి ఎడిటర్ వెయ్యి సాహిత్యపు గాలివానలకి తట్టుకుని బయటపడి, ' ఎందుకు బయటపడ్డానా అని బాధపడుతున్నవాడిలా దీనంగా వున్నాడు. భూపతిరావు తనని తాను పరిచయం చేసుకుని ' శ్రీమతి బిపీ రావ్ ' పేరిట కథ వ్రాశింది తానేనని చెప్పుకున్నాడు.

" కథకి పారితోషికం ఎంతిస్తున్నారు? " అడిగాడు.

“ డెబ్బై అయిదు ”

“ కానీ ఫలానా ప్రసిద్ద రచయితకి నూట పదహార్లు ఇచ్చారటగా ! ”

భూపతిరావు,, ఆయ్ మీన్ బిపీరావ్ బిజినెస్ వ్యవహారాల్లో చాలా కరెక్టుగా వుంటాడు.

అతడి ప్రశ్న విని ఆ ఎర్రబడ్డ ఎడిటర్ “ అవును ఆయనకి నూటపదహార్లు ఇచ్చాం, ఏవిటంటారు ? ” గదమాయించి అడిగాడు.

బిపీరావ్ కాస్త తగ్గేడు. కాస్సేపు నసిగి “ అబ్బే ఏమనటం లేదు . అందరికీ అలానే ఇస్తారేమోననుకున్నా ” అన్నాడు.

ఎడిటర్ విసుగ్గా వుంది. ఎలాగైనా ఇతగాడి నొదిలించుకోవాలని వున్నట్టు చెప్పేశాడు “ చూడండి . మీరు కొత్త రచయితలు. వాళ్ళు ప్రసిద్ద రచయితలు . మీకు కేవలం కథ మాత్రమే వ్రాస్తారు. కాని వాళ్ళు కథ వ్రాసి, దాంతో పాటుగా ఆ కథ అద్భుతంగా వుందని, అటువంటి కథ మునుపెన్నడూ రాలేదని, ఆ రచయిత కథలే మరిన్ని ప్రచురింపమని కోరుతూ అనేకానేక పేర్లతో వుత్తరాలు గూడా వ్రాస్తారు. అంచేత వాళ్ళకి ప్రతిఫలం కాస్త ఎక్కువగా వుంటుంది ”

మర్రిచెట్టు లేకపోయినా బీపీరావు భోధిసత్వుడిలా అవుపించేడు .

------- అయ్యిపోయింది -------